క్లుప్తంగా

రూపాయికే బీఎస్‌ఎన్‌ఎల్ అదిరిపోయే ప్లాన్



దాలినాయుడు, బీఎస్‌ఎన్‌ఎల్ డీజీఎం

విజయనగరం టౌన్: బీఎస్‌ఎన్‌ఎల్ అదిరిపోయే ఫ్రీడమ్ ప్లాన్ తీసుకువచ్చిందని బీఎస్‌ఎన్‌ఎల్ డీజీఎం దాలినాయుడు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఒక్క రూపాయి పెట్టి సిమ్ కొనుగోలు చేస్తే నెల రోజుల పాటు అపరిమిత కాలింగ్, రోజుకు 2జీబీ డేటా, 100 మెసేజ్‌లు ఉచితంగా అందివ్వడం జరుగుతోందన్నారు. కొత్త సిమ్ వినియోగదారులకు మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుందని, సిమ్ కావాల్సిన వారు దగ్గరలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

అవయవదానంపై అవగాహన కల్పించాలి



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ దేవిమాధవి

విజయనగరం ఫోర్ట్: అవయవదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవిమాధవి సూచించారు. ఇదే విషయమై స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ఆమె శనివారం మాట్లాడారు. ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన పేషెంట్ కుటుంబ సభ్యులు, బంధువులకు అవయవదానం ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుదర్శి, నోడల్ అధికారి డాక్టర్ జేఎస్‌వీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: పట్టణంలోని వేణుగోపాలపురం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉషారాణి ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఐదో తరగతిలో ఎస్సీ కేటగిరీలో 35 సీట్లు, ఇంటర్మీడియట్ సీఈసీ గ్రూపులో 55 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. సీట్లు కావాల్సిన విద్యార్థులంతా తమ ఆధార్, రేషన్‌కార్డులతో పాటు కుల, ఇతర ధ్రువపత్రాలతో పాఠశాలను నేరుగా సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9704550016ను సంప్రదించాలని కోరారు.

10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి..

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో నాలుగు ఏరియా ఆస్పత్రులు, మరో నాలుగు పీహెచ్‌సీల్లో దంత వైద్యానికి సంబంధించి, లేబరేటరీ సర్వీసెస్ అందించడానికి సర్వీస్ ప్రొవైడర్ల ఎంపికకు టెండర్లు పిలవడం జరిగిందని డీఎంహెచ్‌వో జీవనరాణి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని దానిని నింపి డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

రాజ్యాంగం అమలులో కూటమి విఫలం

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 14 నెలల కాలంలో దళిత, బహుజనుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టొంపల నరసయ్య, ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావులు ఓ ప్రకటనలో శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన స్థానంలో ఉన్నవారే రాజ్యాంగ నియమాలు సక్రమంగా అమలు చేయడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. ముఖ్యంగా రాష్ట్రంలోని చంద్రబాబు సర్కారు కక్షపూరిత రాజకీయాలను ప్రోత్సహిస్తూ రాష్ట్ర అభివృద్ధిని, ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసిందని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకంపై పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని, 15 రోజుల్లో వేతనాలు చెల్లించాలని చట్టంలో ఉన్నప్పటికీ నిధులు అరకొరగానే విడుదల చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విజయనగరం: నగరంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ మానం వెంకట ప్రణవ్‌గోపాల్‌లు కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. విశాఖ మెట్రోపాలిటన్ రీజనల్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేసేందుకు తమవంతు సహకారాన్ని అందిస్తున్నామని వీఎంఆర్‌డీఏ చైర్మన్ తెలిపారు. అనంతరం రాజీవ్‌నగర్ కాలనీలో పీఎస్ఆర్ పార్కు, అయ్యన్నపేట గాంధీపార్కు, జేఎన్‌టీయూ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరించారు.

విజేతలకు అభినందనలు

విజయనగరం అర్బన్: ఆర్టీఐ(సమాచార హక్కు చట్టం) అమలులోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చీపురుపల్లిలో నిర్వహించిన వక్తృత్వం, క్విజ్ పోటీల్లో జిల్లా స్థాయి విజేతలుగా నిలిచిన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ శనివారం అభినందించారు. రానున్న రోజుల్లో జరిగే పోటీల్లోనూ ఇదే ఉత్సాహంతో పాల్గొని, విజయం సాధించాలని ఆకాంక్షించారు.

చంద్రబాబు మోసాలను తిప్పికొడదాం

- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీలో విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలు వివరిస్తున్న నగర కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్‌లు విజయలక్ష్మి, శ్రావణి



గుంకలాంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు, తదితరులు

విజయనగరం: ఎన్నికల హామీలు అమలు చేయకుండా చంద్రబాబు చేస్తున్న మోసాలను తిప్పికొట్టాలని విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రావణి విమర్శించారు. నగర పరిధిలోని రెండో డివిజన్ ఫూల్‌బాగ్ కాలనీలో శనివారం జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఆ ప్రాంత ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి, కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. ఎన్నికల సమయంలో అధికారమే లక్ష్యంగా అమలు సాధ్యం కాని హామీలిచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా నాన్చుడి ధోరణి అవలంబిస్తుండడం దుర్మార్గమన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎన్నికల హామీలన్నీ అమలు చేయడం జరిగిందని, అర్హులందరికీ కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా పథకాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది కాలం దాటినా ఏ ఒక్క పథకమూ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పటివరకు ఇచ్చిన రెండు, మూడు పథకాలు కూడా అరకొరగానే అమలు చేశారన్నారు. ఇప్పటివరకు గ్యాస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల డబ్బులు పడలేదన్నారు. ఎంతోమంది అర్హులు తమకు డబ్బులు రాలేదని వాపోతున్నారన్నారు. సంపద సృష్టిస్తానని చంద్రబాబు..ఏడాది పాలనలో రూ.1.60 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. అందరికీ పథకాలు ఇస్తామని చెప్పి 8.58 లక్షల పింఛన్లు రద్దు చేశారని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లు దాటిన బీసీలకు పింఛన్లు వంటి పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని, లేకుంటే వైఎస్సార్ సీపీ తరఫున పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బండారు ఆనంద్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకులు ప్రశాంతి, ఉషారాణి, అనూష, సుజాత, జ్యోతి, పరమేశ్వరిదేవి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పాలనలో తేడా గమనించండి..

బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నగర పరిధిలోని 15, 44, 45 డివిజన్లలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టివీరవెంకట రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, నగర అధ్యక్షుడు ఆశపు వేణు శనివారం పర్యటించి, కూటమి మోసాలు వివరిస్తూ అప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను గమనించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అల్లు చాణిక్య, గుజ్జల నారాయణరావు, తాళ్లపూడి సంతోషి, నాయకులు విజయ్‌శంకర్ దుబే, అవనాపు లక్ష్మణరావు, లెంక మహేష్, పిన్నింటి సూర్యనారాయణ, తాళ్లపూడి గణేష్, తాళ్లపూడి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ చూసి ఓర్వలేకే నిర్బంధాలు..

ప్రజల్లో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ఆదరణను చూసి ఓర్వలేకనే ఆయన కార్యక్రమాలకు జనం రాకుండా కూటమి ప్రభుత్వం లేనిపోని నిబంధనలు, నిర్బంధాలు విధిస్తోందని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు మండిపడ్డారు. మండలంలోని గుంకలాం గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన..సర్పంచ్ కునుకు నాగరాజు, వైఎస్సార్ సీపీ ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు డోలా మన్మథకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కెల్ల త్రినాథ్‌లు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి, కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలిపారు. కూటమి కుట్రలు, కుతంత్రాలకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ భయపడదని, ప్రజలకు న్యాయం జరిగేంత వరకు, వారికిచ్చిన హామీలన్నీ నెరవేర్చేంత వరకు పోరాడుతూనే ఉంటుందన్నారు.

తిరుమలాచార్యుని మృతి సాహిత్య రంగానికి తీరనిలోటు



తిరుమలాచార్యుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగుభాషా పరిరక్షణ సమితి సభ్యులు, తదితరులు

విజయనగరం: ప్రముఖ రచయిత, సాహితీవేత్త జేబీ తిరుమలాచార్యుని మృతి సాహిత్య రంగానికి తీరనిలోటు అని తెలుగుభాషా పరిరక్షణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సముద్రాల గురుప్రసాద్, జక్కు రామకృష్ణ కొనియాడారు. నగరంలోని గురజాడ అప్పారావు స్వగృహంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తిరుమలాచార్యుని స్మరిస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శనివారం నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి విజయనగర సాహిత్య రంగానికి తిరుమలాచార్యులు విశేషంగా కృషి చేశారని, సాలూరుకు చెందిన ఈయన ప్రముఖ రచయిత సాహితీవేత్త, వక్త, ప్రయోక్తగా పేరొందారని ప్రశంసించారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు కాగుపాటి నారాయణమూర్తి, ఎం.సుభద్రాదేవి, జిల్లా రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, రఘునందన తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమానికి సిద్ధం



ధర్నాలో పాల్గొన్న ఫ్యాప్టో జిల్లా కమిటీ నాయకులు, ఉపాధ్యాయులు

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేకుంటే ఉద్యమానికి సిద్ధమవుతామని పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీలు జరిగి 45 రోజులు గడిచినప్పటికీ ఉపాధ్యాయులకు జీతాలు మంజూరుకాకపోవడం దుర్మార్గమన్నారు. ఫ్యాప్టో సమర్పించిన 16 డిమాండ్‌లతో ప్రభుత్వం వెంటనే స్పందించాలని లేకపోతే 'ఛలో విజయవాడ' వంటి పెద్ద ఉద్యమానికి సిద్ధమవుతామన్నారు. డిమాండ్‌లలో ప్రధానమైన వాటిలో ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు, బోధనేతర పనుల నుంచి మినహాయింపు, పీ4 కార్యక్రమాన్ని ఉపాధ్యాయులపై బలవంతంగా రుద్దరాదు వంటివి అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లోని డీఏను ప్రకటించి 12వ పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలని, ఐఆర్ ప్రకటించాలన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షనరీ లబ్ధి వెంటనే చెల్లించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ పాల్తేరు శ్రీనివాస్, నాయకులు జేవీఆర్‌కే ఈశ్వరరావు, కె.విజయగౌరి, డి.శ్యామ్, కె.శ్రీనివాసరావు, జోగారావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పతివాడ అప్పారావు మృతి



పతివాడ అప్పారావు (ఫైల్)

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, నెల్లిమర్ల జ్యూట్ మిల్లు శ్రామిక సంఘం మాజీ అధ్యక్షుడు పతివాడ అప్పారావు శనివారం మృతి చెందారు. కొంతకాలం కిందట తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కొన్నిరోజుల పాటు చికిత్స తీసుకున్నారు. అనంతరం అక్కడే తన కుమారుడి ఇంట్లో ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి మరణించారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన కొండగుంపాం గ్రామానికి కుటుంబ సభ్యులు తరలించారు. ఆదివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అప్పారావు మృతి పట్ల శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, సీనియర్ నాయకులు అంబళ్ల శ్రీరాములనాయుడు, గదల సన్యాసినాయుడు, పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం నాయుడు సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే పాఠశాలల అభివృద్ధి

- కూటమి హయాంలో నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేశారు..
- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న ఎంపీపీ మహంతి కల్యాణి

పూసపాటిరేగ: వైఎస్సార్ సీపీ హయాంలోనే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి జరిగిందని, అప్పట్లో ప్రారంభించిన కొన్ని పాఠశాలల తాలూకా నిర్మాణాలు ప్రస్తుతం నిలిచిపోయాయని అలా ఎందుకు జరిగిందని ఎంఈవోలు పాపినాయుడు, రాజకుమార్‌లను మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మహంతి కల్యాణి అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా పలు సమస్యలపై అధికారులను సభ్యులు నిలదీశారు. పాఠశాలల భవన నిర్మాణాల పూర్తిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సభ్యులు పతివాడ అప్పలనాయుడు, బర్రి చినఅప్పన్న, టొంపల సీతారాం, అల్లాడ రమేష్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు అందివ్వడంలోనూ అర్హులకు అన్యాయం చేస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకం డబ్బులు ఒకరికి రూ.13 వేలు పడితే మరొకరికి రూ.10 వేలు, ఇంకొకరికి రూ.8 వేలు పడ్డాయని ఇలా జరగడమేంటన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శిథిలావస్థలోని భవనాలను తొలగించడానికి అనుమతులు ఇవ్వాలని పేరాపురం ఎంపీటీసీ పతివాడ తమ్మునాయుడు, శకాబత్తుల సత్తిబాబు, స్వామినాయుడులు అధికారులను అడిగారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత సీట్లు ఇచ్చేలా విద్యాశాఖ అధికారులు చూడాలని కోరారు.

గ్రామాల్లో కుళాయిలు వేయండి..

కొవ్వాడ శ్మశానవాటికలో షెడ్డును అనుమతులు లేకుండా తొలిగించారని దీనిపై సమాధానం చెప్పాలని ఈవోపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావును సభ్యులు తమ్మునాయుడు డిమాండ్ చేశారు. జల జీవన్ మిషన్ నిధులతో గ్రామాల్లో కుళాయిలు వేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమంత్‌ను సభ్యులు కోరారు. గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. అల్లాడపాలెంలో పైలేరియా బాధితులు ఉన్నారని, వారికి పూర్తిస్థాయి వైద్యం అందేలా చూడాలని సభ్యులు కోరారు. లంకలపల్లిపాలెం, చింతపల్లి గ్రామాలకు కార్యదర్శుల పోస్టులు భర్తీ చేయాలని సర్పంచ్‌లు రౌతు వెంకటరత్నం, బర్రి మోసలి, మైలపల్లి తాతలు అడిగారు. విద్యుత్ శాఖలో నిధుల కొరత ఉండడంతో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయలేకపోతున్నామని విద్యుత్ శాఖ ఏఈ దేముడు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ మహంతి సీతాలక్ష్మి, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, ఎంపీడీవో ఎం.రాధిక, తహసీల్దారు ఎన్వీ రమణ, ఏపీవో తిరుపతిరావు, ఉద్యానవన శాఖ అధికారి ఉమాభరణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి



విద్యుత్ స్మార్ట్‌మీటర్లు వ్యతిరేకిస్తూ నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు, గ్రామస్తులు

విజయనగరం గంటస్తంభం: పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలతో పాటు స్మార్ట్ విద్యుత్ మీటర్లను తక్షణమే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండలంలోని గాజులరేగ సచివాలయం వద్ద శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రెడ్డి శంకరరావు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే స్మార్ట్ విద్యుత్ మీటర్లు రద్దు చేస్తామని చెప్పి, ఇప్పుడు అవే మీటర్లను ఏర్పాటు చేయిస్తుండడం దుర్మార్గమన్నారు. ఎన్నికలప్పుడు యువగళం పాదయాత్రలో ప్రస్తుత మంత్రి లోకేష్..ఎవరైనా స్మార్ట్‌మీటర్లు పెట్టడానికి వస్తే వారు పెట్టిన మీటర్లు బద్దలుకొట్టండి అని పిలుపునిచ్చారని, ఇప్పుడు ఆయనే వాటి ఏర్పాటును సమర్థిస్తుండడం దారుణమన్నారు. స్మార్ట్‌మీటర్ల ద్వారా వ్యాపారవేత్త అదానీకి దోచిపెట్టడానికి తయారయ్యారని విమర్శించారు. టైమ్ ఆఫ్ ది డే విధానం పేరిట పగలు ఒక రేటు రాత్రి ఒక రేటు, సాయంత్రం 6 గంటల నుంచి 10 గంటల వరకు మరో రేటు ఉంటుందన్నారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. దశల వారీగా ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్ బిగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు ఇచ్చాయన్నారు. ఇది మీటర్ మార్పు మాత్రమే కాదని, విధానం మార్చే కుట్ర అని ఇందులో కుతంత్రం ఇమిడి ఉందన్నారు. విద్యుత్ రంగాన్ని బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రైవేటీకరణకు ఇది ఒక మెట్టు అని, దీని పేరే ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ అని దుయ్యబట్టారు. సెల్‌ఫోన్ తరహాలో ముందుగానే డబ్బు చెల్లించి చార్జింగ్ చేయించుకోవాలని, అప్పుడే కరెంటు వస్తుందని, ముందు రూ.500 తగ్గకుండా బ్యాలెన్స్ వేయించుకోవాలని, బ్యాలెన్స్ అయిపోగానే మళ్లీ డబ్బులు చెల్లించి రీచార్జ్ చేసుకోవాలన్నారు. లేకపోతే కరెంటు నిలిచిపోతుందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి స్మార్ట్‌మీటర్లు వ్యతిరేకిస్తూ స్టిక్కర్లు అతికించారు.

చిరస్మరణీయుడు బళ్లారి రాఘవ



విజయనగరం అర్బన్: బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా అధికారులు

విజయనగరం: నాటకరంగ పితామహుడిగా పేరొందిన బళ్లారి రాఘవ చిరస్మరణీయులని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కొనియాడారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో బళ్లారి రాఘవ 146వ జయంతి శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కమిషనర్ సహా కార్యక్రమానికి హాజరైన వారంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. నాటకానికి మరో పేరు బళ్లారి రాఘవ అని, ఉన్నత విద్యావంతుడిగా, ప్రముఖ న్యాయవాదిగా, రావు బహదూర్‌గా ఎంతో పేరు ప్రఖ్యాతలు గడించినప్పటికీ నాటక రంగంపై ఆయన చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. నాటకాలు ఉన్నంతవరకు రాఘవ పేరు చిరస్మరణీయంగా నిలిచే ఉంటుందన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, టీపీఆర్‌వో సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం అర్బన్: కలెక్టరేట్ ఆడిటోరియంలో బళ్లారి రాఘవ జయంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాటక రంగ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ ఏఎంఎస్ కళావతి, జిల్లా పర్యాటక అధికారి కె.కుమారస్వామి, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల వైపు నిలబడి పోరాడుతా

రామభద్రపురం: భూ సమస్యలపై పోరాడుతున్న గిరిజన రైతుల వైపు నిలబడి పోరాడతానని ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు అన్నారు. మండలంలోని కాకర్లవలస, కారేడువలస గిరిజన గ్రామాల రైతులు చాలా రోజులుగా భూ సమస్యలపై పోరాడుతున్న విషయం తెలుసుకున్న ఆయన శనివారం వారు సాగు చేస్తున్న భూములను పరిశీలించారు. ఈ భూముల్లో ఎప్పటి నుంచి సాగులో ఉన్నారు..మీ దగ్గర నుంచి భూములు తీసుకునేటప్పుడు మీకు నోటీసులు ఇచ్చారా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కోసం తమ భూములను దౌర్జన్యంగా లాక్కుంటున్నారని వారు తెలిపారు.

• తల్లిపాలు బిడ్డకు అమృతం



విజయనగరం: బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



డెంకాడ: కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి

తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకత, పౌష్టికాహారం ప్రయోజనాలపై ఐసీడీఎస్ అధికారులు శనివారం అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలని, ఆ పాలు బిడ్డకు అమృతమని పేర్కొన్నారు. ప్రతి తల్లి అప్పుడే పుట్టిన తన బిడ్డకు కనీసం ఆరు నెలల పాటు పాలు ఇవ్వాలని, అలా అయితే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. అలాగే ప్రతిఒక్కరూ రోజూ పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. –విజయనగరం, డెంకాడ